వేంకటేశ్వరునికి జిల్లా జడ్జి పూజలు



ఐ.పోలవరంలో వేంకటేశ్వరుని ఆలయం వద్ద జిల్లా జడ్జి సునీత

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరంలో గోవిందగిరిపై వేంచేసిన వేంకటేశ్వరుని ఆలయాన్ని శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్జి గంధం సునీత కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు నారాయణ రాజు, శివరామ్ స్వాగతం పలికారు. వేద పండితులు సాయిరామ్‌శర్మ, పార్థస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వేంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడి వద్ద బోనాలు



వై.రామవరం ప్రధాన రహదారిలోని దుర్గమ్మ గుడి వద్ద భక్తులు శుక్రవారం రాత్రి బోనాలతో నృత్యం చేశారు. పిల్లలు, పెద్దలు కలిసి కోలాటం ఆడుతూ దుర్గమ్మకు పూజలు నిర్వహించారు. మడకం రామలక్ష్మి, లక్ష్మి, దుర్గ, పార్వతి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, వై.రామవరం

అసలైన పల్లె పండగ ఇదే..



ఈనాడు, పాడేరు, అనకాపల్లి

గ్రామాల్లో రూ.171 కోట్లతో 1,362 పనులకు శ్రీకారం

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ప్రగతికి బాటలు

చెడుపై మంచి సాధించిన గెలుపునకు సూచిక విజయదశమి. గత వైకాపా సర్కారు చీకటి పాలనకు ఇటీవలే చరమగీతం పాడిన ప్రజలు, కూటమి నేతలకు ఈ దసరా మహోత్సవం ప్రత్యేకం. సమస్యలపై జనాలు స్వేచ్ఛగా గొంతు విప్పగలుగుతున్నారు.. పాలకులు ప్రగతి బాటలు వేయడానికి అడుగులు వేస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో రూ.171 కోట్లతో 1,362 రోడ్ల పనులను మొదలు పెట్టబోతున్నారు. గత అయిదేళ్లు నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనులను కార్యరూపంలోకి తెచ్చి అసలైన పల్లె పండగను తెచ్చిపెడుతున్నారు.

అల్లూరి జిల్లాలో..	పనుల సంఖ్య	విలువ (రూ.కోట్లలో)
బీటి రోడ్లు	84	42.70
సీసీ రోడ్లు	56	14.51
గ్రావెల్, మెటల్ రోడ్లు	40	11.79

అందుబాటులో ఆర్థిక సంఘం నిధులు..

గత ప్రభుత్వం పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను మళ్లించేసుకుంది. పల్లె ఖాతాల్లో పైసలు లేకపోవడంతో గ్రామాల్లో కనీసం పారిశుద్ధ్య పనులు చేసుకోలేకపోయారు. నిధులివ్వండి మహాప్రభో అంటూ సర్పంచులు జోలెపట్టి ఆందోళనలు వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు నేరుగా పల్లె ఖాతాలకు చేరుతున్నాయి.

నియోజకవర్గం	పనులు	వెచ్చించే నిధులు (రూ.కోట్లలో)
అనకాపల్లి	85	11.35
చోడవరం	181	19.08
మాడుగుల	193	27.21
పెందుర్తి	128	10.80
నర్సీపట్నం	191	13.61
ఎలమంచిలి	196	11.96
పాయకరావుపేట	208	8.09
	1,182	102.12



గ్రామాల్లో మొదలైన రోడ్ల పనులు

సీసీ రోడ్లు, కాలువలకు ఉపాధి నిధులను ఉపయోగించుకుంటున్నారు. రెండు విడతలుగా ఉమ్మడి జిల్లాలోని 969 పంచాయతీలకు రూ.120 కోట్ల ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలకు వీటిని వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా పనులన్నీ గ్రామసభల్లో ప్రజల అభిప్రాయాలకు పెద్దపీట వేసి ఎంపిక చేయడాన్ని సర్పంచులూ స్వాగతిస్తున్నారు.

‘ఉపాధి’ తోడుగా.. అభివృద్ధి మెండుగా..

గత ప్రభుత్వం అయిదేళ్లు గ్రామాల అభివృద్ధిని పూర్తిగా వదిలేసింది. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక గత పాలకుల లోపాలను సరిదిద్దుతున్నారు. గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా ముందడుగు వేసింది. పల్లె పండగ పేరుతో ఈ నెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువ, బీటీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఒకటి, రెండు కాదు వేల సంఖ్యలో అభివృద్ధి పనులను చేపట్టి పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలు అని నిరూపించబోతున్నారు. దీనికోసం ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోనున్నారు. మెటీరియల్ నిధులు రూపంలో సమకూరిన సొమ్మును గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ఖర్చుచేసి పల్లె ముఖచిత్రాన్ని మార్చబోతున్నారు.

నారీమణుల సారథ్యం.. ప్రగతికి సోపానం..

జిల్లాను ప్రగతిపథంలో నడిపించడంలో మహిళామణుల సారథ్యాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. ప్రభుత్వంలో కీలకమైన హోంమంత్రి పదవిలో ఉన్న వంగలపూడి అనిత శాంతిభద్రతలను గాడితప్పకుండా చూస్తున్నారు. కూటమి నేతలను సమన్వయం చేసుకుంటూ జిల్లాను అభివృద్ధి బాట పట్టించేలా పనిచేస్తున్నారు. విపత్తుల వేళ తక్షణం స్పందించి నష్ట నివారణ చర్యలు చేపడుతున్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో పురుషులతో సమానంగా రాత్రీ పగలు తేడా లేకుండా నీటిలో దిగి సహాయచర్యలను పర్యవేక్షించి మెప్పు పొందారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న రెవెన్యూ సమస్యలపైనా దృష్టిసారిస్తున్నారు.



★ అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తొలిసారిగా ఎన్నికైనా, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

★ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవిలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళుతున్నారు. ప్రజా పరిష్కారాల వేదికగా సమస్యలపై సత్వరం స్పందిస్తున్నారు. జిల్లాలో దీర్ఘకాలంగా వేధిస్తున్న ఎన్ఏఓబీ, బార్క్, నక్కపల్లి పారిశ్రామికవాడకు సంబంధించిన భూ సమస్యలకు పరిష్కారాలను చూపిస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే సెజ్, టూరిజం ప్రాజెక్టులను కార్యరూపంలోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ ప్రాధాన్య పనులను పట్టాలెక్కించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన దీపిక సైతం కొద్ది కాలంలోనే నేరాల కట్టడికి కృషి చేస్తున్నారు.

తాగునీటి వృథా పట్టదా?



లోచలిపుట్టు వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు పట్టణంలోని లోచలిపుట్టు, సుంద్రుపుట్టు వీధుల్లో ఇటీవల చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో నాణ్యత కొరవడటంతో పైపులైన్లు లీకవుతున్నాయి. తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని లోచలిపుట్టువాసులు ఆరోపించారు. పట్టణంలో 450 కుళాయిలకు రూ. 42 లక్షలు నిధులు మంజురు చేశారు. తూతూమంత్రంగా పనులు చేపట్టి బిల్లులు మార్చుకుంటున్న గుత్తేదారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, పైపులైన్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యా‘భరణం’..



డొంకరాయి పికప్ డ్యాం దిగువన అందాలు ఇలా..

మనసును ఆహ్లాదపరిచే ప్రకృతి అందాలకు పుట్టినిల్లు లోయరు సీలేరు ప్రాజెక్టు. సీలేరు నది పొడవునా, జలాశయాల నడుమ, ఎగువ, దిగువన మనోహర, రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

మంచు కురియడం ప్రారంభం కావడంతో సహజ అందాలకు మంచు బిందువులు తోడై మరింత శోభను చేకూర్చుతున్నాయి. సందర్శకులను ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి. లోయరు సీలేరు ప్రాజెక్టులో పచ్చదనంతో పర్యాటకులను మైమరిపిస్తున్న దృశ్యాలివి... మోతుగూడెం, న్యూస్‌టుడే



డొంకరాయి పికప్ డ్యాం వద్ద ప్రకృతి రమణీయత



మోతుగూడెంలోని పంప్‌హౌస్ దిగువన సీలేరు నది అందాలు

అప్రెంటీస్ మేళా 14న

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలోని ఆర్‌ఐటీఐలో ఈనెల 14న అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వివిధ ట్రేడ్‌ల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. రెండు పాస్‌ఫొటోలతోపాటు ధ్రువపత్రాల జిరాక్స్‌లను వెంట తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



భూమాతకు పచ్చని దుప్పటి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ప్రకృతి అందాలకు నిలయమైన మన్యం పచ్చని అందాలతో మెరిసిపోతోంది. దట్టమైన అడవులు.. గిరిజనులు సాగు చేసిన పంట పొలాలు.. వాటి మధ్య ప్రవహిస్తున్న కాలువలు.. ఇలా పచ్చని అందాల మధ్య ఉన్న గిరిజన గ్రామాలు ప్రకృతి ప్రియులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. ముంచంగిపుట్టు మండలం రంగబయలు ప్రాంతంలోని లంగ్బాపొదోర్ గ్రామ సమీపంలోని ప్రకృతి అందాలను మీరూ ఆస్వాదించండి..

రానున్న ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: రాగల ఐదు రోజుల్లో అల్లూరి జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు.

ఆంధ్రా కశ్మీర్‌లో సందడి



చింతపల్లి మండలంలోని పర్యటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. దసరా సెలవుల నేపథ్యంలో దూరప్రాంతాల నుంచి పర్యటకులు ఆంధ్రాకశ్మీర్ లంబసింగి, తాజంగి, చెరువులవెనం ప్రాంతాలకు తరలివచ్చారు. ఈప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. – చింతపల్లి, న్యూస్‌టుడే

అరకులోయ కిటకిట



గిరిజన మ్యూజియం వద్ద సందర్శకులు

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రాఊటీ అరకులోయలో పర్యటకులతో సందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులతో అరకులోయ కిటకిటలాడుతోంది. గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం, వ్యూపాయింట్ తదితరాలు పర్యటకులతో నిండిపోయాయి. ప్రధాన రహదారుల్లో రద్దీ నెలకొంటోంది. ఆర్టీసీ బస్సులు సైతం కిటకిటలాడుతున్నాయి.


ఓపీ కావాలంటే చరవాణి ఉండాలంట..!

పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ విభాగమిది. రోగులు చరవాణులతో వరుసలో నిల్చున్నారు. రోజూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఓపీ రసీదు ఇవ్వాలంటే చరవాణి నంబరు తప్పనిసరిగా ఉండాలని సిబ్బంది చెప్తుండటంతో అవస్థలు తప్పడం లేదు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది చరవాణులేక వెనక్కి వెళ్లిపోతున్నారు. దీనిపై సంబంధిత సిబ్బందిని ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా.. ఖాళీగా ఉన్నప్పుడు నేరుగా ఓపీ ఇస్తున్నామని చెప్పారు. రోగి బంధువులు చరవాణి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఇస్తున్నామని పేర్కొన్నారు.



పాడేరు జిల్లా ఆసుపత్రిలో బారులు తీరిన రోగులు

– పాడేరు, న్యూస్‌టుడే



ఇంద్ర ధనస్సు కనువిందు

ఎలమంచిలి గ్రామీణం, చోడవరం న్యూస్‌టుడే

ఎలమంచిలి, చోడవరం ప్రాంతాల్లో ఆకాశంలో శుక్రవారం ఉదయం ఇంద్రధనస్సు అలరించింది. ఒక పక్కన వర్షం కురుస్తూ.. మరో పక్క సూర్యుడి లేలేత కిరణాలు నేలపై పడుతుండగా ఇంద్ర ధనస్సు ఏర్పడింది. ప్రకృతి ప్రేమికులు ఫొటోలు తీసుకుని ఆసక్తిగా తిలకించారు.

నేటి నుంచి పాపికొండల పర్యటకం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరదల నేపథ్యంలో నిలిచిపోయిన పాపికొండల పర్యటకం శనివారం విజయదశమి రోజున పోచవరం రేవు నుంచి ప్రారంభిస్తున్నట్టు పోచవరం పాపికొండల పర్యాటక బోట్ల యాజమాన్య సంఘం సభ్యులు మాదిరెడ్డి సత్తిబాబు, చవ్వాకుల ప్రకాశరావు, వాళ్లరంగారెడ్డి తెలిపారు. రేఖపల్లిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. ప్రస్తుతానికి తొమ్మిది బోట్లకు అనుమతులు ఉన్నాయన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

గంగవరం: కొత్తాడలో నాటుసారా విక్రయిస్తున్న సున్నం నూకన్నదొరను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై డి.భూషణం తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతని నుంచి అయిదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై రజాక్ పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో వసతులు కల్పించాలి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పీవీటీజీలకు పీఎం జన్‌మన్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజై డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ శాఖ కార్యదర్శులు నాగేంద్రకుమార్, కామేశ్వరరావు ఆధ్వర్యంలో చెరువుల వెనం గ్రామంలో పార్టీ మహాసభ నిర్వహించారు. పీవీటీజీ గ్రామాల్లో ఈ పథకం అమలుకు నోచుకోలేదన్నారు. గ్రామాల్లో వసతులు కల్పించాలన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, సత్తిబాబు, వంతల బాబు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

40 మద్యం దుకాణాలు.. 1203 దరఖాస్తులు

పాడేరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగిసిందని అల్లూరి జిల్లా ఇన్‌ఛార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ తెలిపారు. జిల్లాలోని 22 మండలాల్లో 40 దుకాణాలు కేటాయించగా.. 1188 దరఖాస్తులు అందాయని చెప్పారు. ఈనెల 14వ తేదీన పాడేరులోని వి.ఆర్. ఫంక్షన్ హాల్ వద్ద జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీయనున్నట్లు చెప్పారు. లైసెన్సు పొందినవారు ఈనెల 16వ తేదీ నుంచి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మద్యం దుకాణాలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.

కీళ్లు పట్టేసి.. ఒళ్లు పడకేసి..

■ వయస్సుతో సంబంధం లేకుండా నొప్పులు

■ నేడు వరల్డ్ ఆర్థరైటిస్ నివారణ దినం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లికి చెందిన ఓ యువకుడు బాడీబిల్డర్‌గా పతకాలు సాధించాడు. ఉద్యోగంలో స్థిరపడ్డాక వ్యాయామం ఆపేశాడు. ఒళ్లు నొప్పులు రావడంతో పెయిన్‌కిల్లర్స్ వాడేవాడు. వైద్యుడి వద్దకు వెళ్లి సమస్యను చెప్పి పరీక్ష చేయగా ఆర్థరైటిస్ అని తేలింది. దీంతో నిత్యం మందులు వాడుతున్నాడు.

★ ఇటీవల అనకాపల్లి ఆసుపత్రిలో ఎనిమిదేళ్ల బాలుడికి పరీక్ష చేయగా కీళ్ల వ్యాధి ఉన్నట్లు గుర్తించారు.

★ కశింకోటకు చెందిన మహిళకు తరచూ కీళ్లు పట్టేస్తుండడంతో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. గర్భసంచి తొలగించిన అనంతరం ఈ సమస్య వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు.


చికిత్సకు ఆసుపత్రికి వచ్చిన రోగులు

వయస్సుతో సంబంధం లేకుండా కీళ్లవ్యాధిగ్రస్థులు పెరిగిపోతున్నారు. గతంలో 60 సంవత్సరాల పైబడిన వారికి ఈ తరహా నొప్పులు ఉండేవి. మారుతున్న జీవన విధానం, ఆహార అలవాట్లతో ఎముకల వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి వచ్చే ప్రతి 100 మంది రోగుల్లో 40 మంది వరకు ఈ వ్యాధితో బాధపడే రోగులే!

నేటి యువతీ యువకులు ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్స్‌కు అలవాటు పడుతున్నారు. ఇదే ఆర్థరైటిస్‌కు కారణమని వైద్యులు చెబుతున్నారు. జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల సరిగ్గా జీర్ణం కాక, ఎముకల సందుల్లో ఖాళీ భాగం ఏర్పడి గ్యాస్ చేరడంతో కీళ్లవ్యాధులకు కారణమవుతోంది. శారీరక వ్యాయామం లేకపోవడం ఎక్కువగా కూర్చునే పని చేయడం. . శరీర భంగిమలు సరిగా లేకుండా పనులు చేయడంతో ఈ వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నారు. వీరికి ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. మందులు, అవసరమైతే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇది రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. ఈ రోగులను గుర్తించేందుకు రక్తపరీక్ష చేసి వ్యాధి నిర్ధారణ అయితే దీర్ఘకాలికంగా మందులు వాడాల్సి ఉంటుంది. రుమటాలజిస్ట్ పర్యవేక్షణలో పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులను వాడుతూ వ్యాయామం చేయడం వల్ల ఈ సమస్యను దాదాపుగా నివారించొచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఆహారపు అలవాట్లూ కారణమే!



ఈ వ్యాధులకు సంబంధించిన రోగులు పెరుగుతున్నారు. పంటపొలాల పర్యావరణంతో వచ్చే కీళ్ల వ్యాధులు కొన్ని ఉంటే, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో వచ్చే కీళ్ల వ్యాధులు మరి కొన్ని ఉన్నాయి. వాతావరణ కాలుష్యంతో ఎముకల్లో కాల్షియం తగ్గుతుంది. ఇవి కీళ్ల వ్యాధులకు కారణమవుతుంది. చిన్నవయస్సులోనే మహిళలు గర్భసంచి తీయించుకుంటున్నారు. దీనివల్ల కొన్ని నెలలు, సంవత్సరాలకు కీళ్లవ్యాధుల బారిన పడుతున్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి.

– డాక్టర్ శ్రీనివాసరావు, ఎముకల వైద్యనిపుణులు, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి, అనకాపల్లి

80 రకాల వాత రోగాల గుర్తింపు



కీళ్ల సంబంధిత వ్యాధులను ఆయుర్వేదంలో వాత సంబంధిత రోగాలుగా గుర్తిస్తాం. 80 రకాల వాత రోగాలు ఉన్నాయి. వీటికి అనకాపల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. కీళ్ల వ్యాధుల సాంప్రదాయ బట్టి పరీక్ష చేసి రోగికి ఏ మందులు అవసరమో వాటిని అందిస్తాం. కొంత మందికి పంచకర్మలతో నయం అవుతుంది. మారుతున్న ఆహారపు అలవాట్ల వల్లనే చిన్నపిల్లలకు సైతం కీళ్ల వ్యాధులు వస్తున్నాయి. సకాలంలో గుర్తించి చికిత్స పొంది ఆహారపు నియమాలను పాటిస్తే ఉపశమనం పొందొచ్చు.

– డాక్టర్ లావణ్య, ప్రభుత్వ ఆయుర్వేద వైద్య నిపుణురాలు, అనకాపల్లి

'ఉపాధి' కూలీలకు బాసట

జిల్లాలో వేతనదారులు:	3,13,661
జాబ్‌కార్డులు ఉన్నవారు:	2,79,897
మనుగడలో ఉన్న కార్డులు:	2,09,537
పనులకు వెళ్తున్నవారు:	1,98,535
100 రోజులు పని చేసిన వారు:	4,502

కలెక్టరేట్, న్యూస్‌టుడే

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలిచింది. కూలీలకు సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకునేలా జన్‌మన్ రేగా యాప్ రూపొందించింది. గతంలో ఈ పథకంలో పనిచేసే కూలీల వేతన బకాయిల కోసం, జాబ్ కార్డుల కోసం ఎంపీడీవో కార్యాలయం, తపాలా కార్యాలయాలు, ఉపాధి హామీ పథకం అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవారు. సరైన సమాచారం దొరక్కపోవడంతో తీవ్ర అవస్థలు పడేవారు. వీరి కష్టాలను గుర్తించి ఈ యాప్ అందుబాటులోకి తేవడంతో స్మార్ట్ ఫోన్‌లో సమస్త సమాచారం ఒక్క క్లిక్‌తో ఇట్టే తెలుసుకునే అవకాశం కలిగింది.

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జన్‌మన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. క్లిక్ చేయగానే పూర్తి సమాచారం డిస్‌ప్లేపై కనిపిస్తుంది. ఇందులో కూలీలు వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాక్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్‌కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు వస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, కూలి వేతనం మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో పనిచేసిన రోజులకు జమ అయిన నగదు, బకాయిలు వంటి పూర్తి వివరాలు వస్తాయి. వేతనం జమకాకపోతే కారణాలు సైతం స్పష్టంగా కనిపిస్తాయి. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు సమాచారం ఉంటుంది. ఇలా పథకంలో పనిచేసిన ప్రతి కూలీ వివరాలు తెలుసుకోవచ్చు.


ఉపాధి హామీ పనుల్లో కూలీలు

అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు

పని చేయకపోయినా చేసినట్లు, కూలీల సొమ్ము స్వాహా వంటివి బహిరంగ ప్రజావేదికల్లో ఆడిట్ జరిగినప్పుడు మాత్రమే వెలుగులోకి వచ్చేవి. ఇకపై అవినీతి జరిగిందని తెలిస్తే ఈయాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. కూలీలతో కాకుండా యంత్రాల సహాయంతో పనిచేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా, నిధులు దుర్వినియోగం చేసి దొంగ మస్త్రలకు పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేయగానే అధికారులు విచారణ చేపడతారు. ఈ యాప్ కూలీలకు భరోసా కల్పించడంతోపాటు పారదర్శకతను పెంచడానికి దోహదపడుతుంది.

అందుబాటులోకి జన్‌మన్ రేగా యాప్

కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్‌రేగా యాప్‌పై పని ప్రదేశాల్లో కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. సెల్‌ఫోన్లలో ఈ యాప్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎలాంటి సమాచారం ఉంటుంది తదితర వివరాలు తెలియజేస్తున్నాం. కూలీలు ఈ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి.

– మణికుమార్, ఏపీడీ, ఉపాధి హామీ పథకం

కలప అక్రమ నిల్వలపై దాడి

కూనవరం, న్యూస్‌టుడే: పాలగూడెం, బోదునూరు గ్రామాల్లో కలప అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు కూనవరం అటవీశాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎఫ్ఆర్వో ఎం.కరుణాకర్ తన సిబ్బందితో కలిసి రెండు గ్రామాల్లో అనుమానితుల ఇళ్ల వద్ద తనిఖీ చేశారు. రెండు గ్రామాల్లో కలిపి రూ.37 వేలు విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. గ్రామస్థుల సమక్షంలో వారికి అవగాహన కల్పించి, గ్రామస్థుల హామీ మేరకు అపరాధ రుసుము విధించి వదిలిపెట్టారు. ఎఫ్ఎస్వోలు అనిల్‌కుమార్, శంకర్‌రెడ్డి, దేశయ్య, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


నిందితులతో అటవీ అధికారులు

ముగిసిన వాలీబాల్ టోర్నీలు

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలో నిర్వహించిన సీనియర్ క్రీడాకారుల స్మారక వాలీబాల్ టోర్నీ విజేతగా దొరవలస జట్టు నిలిచింది. మూడురోజులపాటు నిర్వహించిన ఈ టోర్నీ ఫైనల్ శుక్రవారం జరిగింది. దొరవలస, లంతంపాడు జట్లు పోటీపడ్డాయి. దొరవలస జట్టు విజేతగా, లంతంపాడు జట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడో స్థానాన్ని పెదబయలు మండలంలోని తూటంగి జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చేతులమీదుగా బహుమతులు అందజేశారు. సర్పంచి దాసుబాబు, వైకాపా నాయకులు అశోక్, నిర్వాహకులు బురిడి ఆనందరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం తదితరులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: కుంజావారిగూడెంలో కొమరంభీం యూత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీ విజేతగా ఎటపాక మండలం కేవీఎన్‌పురం జట్టు నిలిచిందని నిర్వాహక కమిటీ సభ్యులు కుంజా రమేశ్ తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో రన్నర్‌గా కుంజావారిగూడెం, మూడోస్థానంలో వేగితోట జట్లు నిలిచాయి. విజేతలకు ఎంపీపీ కారం లక్ష్మి, ఉపాధ్యాయులు భీమయ్య, చిన్నబాబు బహుమతులు అందించారు.

ఎటపాక, న్యూస్‌టుడే: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ జమాల్‌ఖాన్ అన్నారు. బొజ్జిగుప్పలో వారం రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున మొత్తం రూ.30వేలుతో పాటు, జ్ఞాపికలను ట్రస్టు తరపున జమాల్‌ఖాన్ అందజేశారు. సర్పంచి కారం వెంకటేశ్వర్లు, తెదేపా సీనియర్ నాయకులు ముప్వా శ్రీను, పాటి చలపతిరావు, మాజీ ఎంపీపీ ఉబ్బా సత్యం, తెలుగు యువత నాయకులు నలజాల శ్రీకాంత్, బాచినేని శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు మోడె సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4.5 లక్షలతో సీసీ రోడ్డు


సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎగువశోభలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. సుమారు రూ.4.5 లక్షల జడ్పీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. మాజీ సర్పంచి పాంగి అరుణ, పాంగి మొద్దు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


జగ్గంపాలెంలో వృద్ధురాలికి సేవలందిస్తున్న వైద్యుడు

గంగవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ ట్రస్ట్, జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ ఎన్టీఆర్ ట్రస్టు ఇన్‌ఛార్జి సాయిబాబు ఆధ్వర్యంలో జగ్గంపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. స్థానిక తెలుగుదేశం నాయకులు చవలం రాధాకృష్ణ దొర, పి.గోవిందరాజు, కోసు రాము, బి.చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: గౌరిదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని గన్నవరంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరం వద్దకు వచ్చిన వారికి పరీక్షలుచేసి మందులు ఇచ్చారు. వాతావరణ మార్పులతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, అందుకోసం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు


బురదగెడ్డ వద్ద నిలిచిన వాహనాలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవులతో అరకులోయకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఘాట్‌రోడ్డులోని వ్యూపాయింట్ల వద్ద ప్రకృతి అందాలు చూసేందుకు పర్యటకులు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేస్తున్నారు. అరకులోయ పట్టణం, ప్రధాన రహదారి, పద్మాపురం ఉద్యానం, అరకు సంతమార్కెట్, డముకు, గాలికొండ వ్యూపాయింటు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


గాలికొండ వ్యూపాయింట్ వద్ద ఇలా..

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ, అరకులోయ మండలాల సరిహద్దులోని బురదగెడ్డ వంతెన వద్ద శుక్రవారం భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అరకు నుంచి పాడేరు వైపునకు వెళ్తున్న వాహనాలు ఎక్కడిక్కడే ఆగిపోయాయి. అర కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సైలు పాపినాయుడు, గోపాలరావు, పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఏసు శాంతి బోధనలు సమాజానికి అవసరం

ఎటపాక, న్యూస్‌టుడే: ఏసు శాంతి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రామయ్యదొర అన్నారు. కుసుమానపల్లిలోని కృపా గాస్పెల్ చర్చి మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉయికా పీటర్ సింగయ్య ఆధ్వర్యంలో సండే స్కూల్ శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. సింగయ్య మాట్లాడుతూ పిల్లలు మంచి విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సీన, భీమయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందారు. సీఐ పి.విశ్వం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం మైపాడుకు చెందిన పి.అనంతమ్మ కొంతకాలంగా కొవ్వూరు టోల్‌గేట్ వద్ద ఉంటున్నారు. శుక్రవారం కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన సమీపంలో రాజమహేంద్రవరం వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జగన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కూనవరం ఎస్సైగా లతశ్రీ

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం ఎస్సైగా ఎల్.లతశ్రీ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కె.శ్రీనివాసరావు నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. దుశ్చర్తిలో విధులు నిర్వహించిన లతశ్రీ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అందరి సహకారంతో శాంతి భద్రతలు కాపాడతానని లతశ్రీ చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	118
లైవ్	142	138
డ్రెస్డ్	206	246
స్కిన్‌లెస్	234	256

ఉచ్చులు వేస్తే కఠిన చర్యలు


ఆకుమామిడికోట గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అడవిలో జంతువుల వేటకు విద్యుత్తు తీగలు పెట్టినా, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేసినా కేసులు తప్పవని సీఐ గోపాలకృష్ణ హెచ్చరించారు. ఆకుమామిడికోటలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సై రాము పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడిలో మోతుగూడెం ఎస్సై శివనారాయణ శుక్రవారం ఉదయం గ్రామస్థులకు విద్యుత్తు తీగల ఉచ్చులపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పంట పొలాలు, అటవీ ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు అమర్చి అడవి పందులు, ఇతర వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ మెట్టగూడలో వేటగాళ్లు అడవి పందులకు ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగ తగిలి కూంబింగ్ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ ఏఎస్సై మృతిచెందిన విషయాన్ని వివరించారు.

★ వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో ఎస్సై శివకుమార్ శుక్రవారం సాయంత్రం గ్రామస్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ... అడవి జంతువుల వేట కోసం, పంట పొలాలను కాపాడటానికి అటవీ ప్రాంతాల్లో విద్యుత్తు తీగలతో ఉచ్చు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డొంకరాయి జెన్‌కో అధికారి శ్రీనివాస్, లైన్‌మెన్ నీలం రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రజలంతా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కొయ్యూరు సీఐ వెంకటరమణ అన్నారు. శుక్రవారం రాత్రి చీడిపాలెంలో ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అధిక డబ్బులకు ఆశపడి గంజాయి కేసుల్లో చిక్కుకోవద్దని యువతకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని పేర్కొన్నారు.

ముంచంగిపుట్టు, జి.మాడుగుల, పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ, అటవీ భూముల్లో, జన సంచార ప్రదేశాల్లో అనధికారికంగా విద్యుత్తు తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవీంద్ర హెచ్చరించారు. శుక్రవారం బాబుసాల పంచాయతీ గాజులబంద, మొండిగుమ్మ, కాండ్రింగివలస గ్రామాల్లో సాయుధ పోలీసులతో గ్రామ సందర్శన నిర్వహించారు. గంజాయి సాగు, రవాణా చేపట్టి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ప్రత్యేక పోలీసు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. విద్యుత్తు తీగలు అమర్చి జంతువులు, మానవులకు ప్రాణహాని కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని జి.మాడుగుల, పెదబయలు ఎస్సైలు షణ్ముఖరావు కె రమణ అన్నారు. సీకరి గ్రామాన్ని శుక్రవారం ఎస్సై రమణ సందర్శించి రైతులతో మాట్లాడారు. గిరిజనులు గంజాయికి బదులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలని సూచించారు.


గిరిజనులకు సూచనలిస్తున్న ముంచంగిపుట్టు ఎస్సై

కాఫీ.. విరగ్గాసి!


మోదాపల్లిలో కాఫీ గింజలు

నాణ్యత, రుచిలో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మన్యం కాఫీ దిగుబడి ఈ ఏడాది మరింత పెరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఏటా పాడేరు మన్యంలో 1.5 లక్షల ఎకరాల్లో పది వేల టన్నుల వరకూ కాఫీ ఉత్పత్తి జరుగుతోంది. ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురవడం, ఇతర వాతావరణ పరిస్థితులు పంటకు అనకూలంగా మారాయి. మొక్కలు ఏపుగా పెరిగి తోటలు బాగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గింజలు ప్రాథమిక దశలో ఉన్నాయి.. సంక్రాంతి నాటికి దిగుబడి చేతికి అందుతుంది. సాధారణంగా ఒక్కో ఎకరాకు 40 నుంచి 50 కేజీల పార్చిమెంట్, చెర్రీ కాఫీ దిగుబడి వస్తుండగా.. ఈ ఏడాది మరో ఐదు కేజీల చొప్పున పెరిగే సూచనలున్నట్లు రైతులు చెబుతున్నారు. కేంద్ర కాఫీ బోర్డు, స్థానిక ఐటీడీఏ సైతం ఈ సాగు విస్తరణ, మార్కెటింగ్‌కు ప్రోత్సాహం అందిస్తుండడంతో రైతులు మంచి ఆదాయం పొందే సూచనలున్నాయని మార్కెట్ పరిశీలకులు భావిస్తున్నారు.
– న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

సంతకు దసరా కళ


అరుకు సంతలో మేకలు, గొర్రెల విక్రయాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరుకు పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జరిగిన సంతకు దసరా కళ సంతరించుకుంది. సంత ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. మేకలు, గొర్రెలు, కోళ్లకు గిరాకీ ఏర్పడింది. వస్త్ర దుకాణాల్లో రద్దీ నెలకొంది. ట్రాఫిక్ నియంత్రణకు ఎస్సై పాపినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు.

అనంతగిరి మండలంలోని కాశీపట్నంలో ప్రతి బుధవారం జరిగే సంత ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందింది. మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వ్యాపారులు ఇక్కడకు వచ్చి సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. – న్యూస్‌టుడే, అనంతగిరి గ్రామీణం

మన్యం వంకాయ.. మంచి రుచయ్యా!


కాశీపట్నం సంతలో వంకాయల విక్రయాలు

ఆనందంగా ఉంది..

మాది కాటిమానివలస గ్రామం. ఎరువులు వేయకుండా గ్రామంలో వంకాయలు పండిస్తుంటాం. రెండు తట్టల వంకాయలను సంతకు తీసుకొచ్చి విక్రయించగా సుమారు రూ.1200 ఆదాయం వచ్చింది. ఎంతో ఆనందంగా ఉంది.
– సియాద్రి రాము, కాటిమానివలస



ఇక్కడ వంకాయలకు మార్కెట్‌లో ధర ఎక్కువగా పలుకుతోంది. ఎరువులు వేయకుండా సహజసిద్ధంగా పండించిన పంటను గిరిజనులు ఇక్కడకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కాశీపట్నంలో దొరికే వంకాయలకు మంచి గిరాకీ నెలకొంది. కాశీపట్నం, చిలకలగెడ్డ, బీంపోలు, గుమ్మకోట పంచాయతీల్లో సుమారు 1000 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగు చేస్తున్నారు. ఎటువంటి ఎరువులు వేయకుండా వీటిని పండిస్తుండటంతో వీటి కొనుగోలుకు ఎగబడుతున్నారు. వ్యాపారులు ఇక్కడ వంకాయలను కొనుగోలు చేసి విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. బుధవారం ఇక్కడ జరిగే సంతకు సుమారు 40 గ్రామాల్లో పండించిన వంకాయలను గిరిజనులు తీసుకొచ్చి విక్రయిస్తారు. ఆ సొమ్ముతో వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఈ బుధవారం ఒక కావిడి వంకాయలు (25 కేజీలు) ధర రూ.1200 నుంచి రూ.1400 వరకు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మైదాన ప్రాంత వ్యాపారుల రాకతో..

ఎకరం పొలంలో వంకాయలు సాగు చేస్తున్నాను. ఈ వారం సంతలో ఒక కావిడ వంకాయలకు రూ.1300 ధర పలికింది. దసరా పండగకు కావాల్సిన సరకులు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాను. మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో వ్యాపారులు రావడంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. – సున్నపు రాము, సున్నపుబడ్డు



ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలో సిరిగిందలపాడులో రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరజ్ఞేయానంద మహరాజ్ తెలిపారు. రాజమహేంద్రవరానికి సమీపంలోని వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తామన్నారు. వైద్యానికి వచ్చే వారంతా రేషన్, ఆధార్ కార్డులు తీసుకురావాలన్నారు.

14 నుంచి పల్లె పండగ

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాల్లో ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.వి.వి కుమార్ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమస్యలపై వినతులు స్వీకరించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

అ వీ ఇ వీ

అన్నదానానికి వితరణ

ఎటపాక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల సందర్భంగా గుండాల కాలనీలోని అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు ఆయుర్వేద వైద్యులు, జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ అన్నదానం నిమిత్తం రూ.10,000 శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులంతా కష్టసుఖాల్లోనూ కలిసిమెలిసి ఉండి సాయం చేసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు జమాల్‌ఖాన్‌ను శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గుండాల కాలనీ వాసులు రూపలక్ష్మి, జితేష్, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: కుటుంబ పెద్దలను కోల్పోయిన రెండు కుటుంబాలకు చింతూరు జమాల్‌ఖాన్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. వీఆర్‌పురం బీసీ కాలనీకి చెందిన కోట్ల లక్ష్మణరావు పాముకాటుతో, తుంగ రాంబాబు అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. ఈ రెండు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న తెదేపా నాయకులు జమాల్‌ఖాన్ ఒక్కో కుటుంబానికి రూ.అయిదు వేలు చొప్పున ఆర్థిక సాయం పంపించారు. ఈ మొత్తాలను తెదేపా సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, బొర్రా నరసింహారావు, చంద్రశేఖర్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

సీపీఐ సమావేశం 16న

కొయ్యూరు, న్యూస్‌టుడే: సీపీఐ మండల సమితి సమావేశం ఈనెల 16న రావణాపల్లిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు శుక్రవారం తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ తదితరులు హాజరయ్యే సమావేశానికి శ్రేణులంతా హాజరుకావాలని కోరారు.

'జిల్లా కేంద్రం మార్పుతో నష్టం'

అరకులోయ, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లా కేంద్రాన్ని పాడేరు నుంచి నర్సీపట్నం తరలిస్తే గిరిజన యువతకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రాన్ని నర్సీపట్నం తరలిస్తారని స్థానికంగా చర్చ జరుగుతోందన్నారు. పాడేరులోనే జిల్లా కేంద్రాన్ని ఉంచాలని కోరారు. సర్పంచి సుస్మిత, వైకాపా నాయకులు జగన్, సుంక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఛైర్‌పర్సన్‌గా నవభారత్



చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ఛైర్‌పర్సన్‌గా రీమల నవభారత్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ప్రకటించింది. చింతపల్లికి చెందిన నవభారత్ ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ యువనాయకుడిగా పనిచేశారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నాగుపాముల సంచారంతో ఆందోళన

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరులోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం గంట వ్యవధిలో మూడు నాగుపాములు కనిపించాయి. లోచలిపుట్టు, గుడివాడ కాలనీ, రేకులకాలనీలో నాగుపాములు హడలెత్తించాయి. వారం రోజుల క్రితం చాకలిపేటలోని ఉపాధ్యాయుడు ఇంట్లో ఎగిరే పాము కనిపించింది. దీంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చిన్నజడుమూరు గ్రామానికి తాగునీరు అందుబాటులోకి తీసుకొచ్చామని సంకాడ సర్పంచి నాగులమ్మ అన్నారు. గ్రామంలో నిర్మించిన తాగునీటి పథకాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా స్థానిక గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్, ఇంజినీరింగ్ సహాయకులు పావని, కూటమి నాయకులు వలసన్నపడాల్, లింగమూర్తి, చిట్టిబాబు, రాజారావు, యోగా శిక్షకుడు ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.


తాగునీటి పథకం ప్రారంభిస్తున్న సర్పంచి నాగులమ్మ తదితరులు

అమ్మా భవానీ.. శక్తి స్వరూపిణీ


ముంచంగిపుట్టులో..


ఎటపాక మండలం గుండాల కాలనీలో భక్తుల పూజలు


దూసరపాములో దుర్గమ్మ


వడ్డిగూడెం శివాలయంలో..


సీలేరులో కుంకుమ పూజలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: విజయదశమి శరన్నవరాత్రులలో భాగంగా దుర్గమ్మ శుక్రవారం మహిసాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, చికిలింత, అమినాబాద్, బడదనాంపల్లి, శరభవరం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర తదితర గ్రామాల్లో దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మార్కెట్‌వీధి, స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న దేవీఆలయాల్లో శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్థానిక మార్కెట్‌వీధిలోని ఆలయంలో దుర్గామాతకు గోలి రాజబాబు, సత్య దంపతులు వెండితో తయారు చేసిన పంచపాత్రను బహూకరించారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం లక్ష్మీ గణపతి, వనదుర్గ పొల్లూరు దుర్గా మల్లేశ్వర, జల విద్యుత్కేంద్ర ఆలయాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకస్వామి కుమార్‌స్వామి శర్మ జల విద్యుత్కేంద్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సివిల్ ఏడీఈ కొండబాబు బృందం అందజేసిన దుస్తులను జెన్‌కో ఉన్నతాధికారులు గుత్తేదారు కార్మికులకు పంపిణీ చేశారు. సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీరు వాసుదేవరావు, ఎస్ఈ చిన కామేశ్వరరావు, డీఈ బాలకృష్ణ, ఎస్ఏవో వరప్రసాద్, ఏఈ పవన్, ఫోర్‌మేన్ రత్నాకర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

మహిసాసుర మర్దినిగా దుర్గమ్మ

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు, సింగవరం గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొయ్యూరులో భారీ అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. ఆలయ ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్, తితిదే ధర్మప్రచారకర్త డి.పద్మరాజు, అర్చకులు వరహగిరి కృష్ణ శర్మ, శ్రీరామచంద్రమూర్తి, కమిటీ సభ్యులు బాలరాజు, చిరంజీవి, దొరబాబు, చక్రరావు, నాగేశ్వరరావు, వీరయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులో కొలువుదీరిన దుర్గమ్మకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జోలాపుట్టు, కరిముఖిపుట్టు, కాంద్రం గివలస, సుజనకోట గ్రామాల్లో శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గుమ్మశిరగంపుట్టు మాటీ రోడ్డుపై ఉన్న అమ్మవారి సన్నిధిలో పూజలు జరిగాయి.


చింతపల్లి సాయినగర్ వీధిలో..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం కనకదుర్గమ్మ, వడ్డిగూడెం శివాలయాలు, గ్రామాల్లోని అమ్మవారి ఉత్సవ మండపాలు, భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి, అర్చకులు పూజలు చేశారు. కొన్నిచోట్ల సామూహిక కుంకుమ అర్చనలు జరిపారు. భక్తులు తెచ్చిన ప్రత్యేక పిండి వంటలను అమ్మవారికి నైవేద్యాలుగా నివేదించి, మంగళహారతులు పట్టారు. వడ్డిగూడెంలో ఉత్సవ కమిటీ సభ్యులు రాత్రి అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

ఎటపాక: మహిసాసుర మర్దిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లిపాక, చోడవరం, నందిగామ, గుండాలకాలనీ, లక్ష్మీపురం, తోటపల్లి, ఎటపాక తదితర గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రింతాడలో దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మాలధారులు, స్థానిక వ్యాపారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి స్పందన లభించింది.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులోని దేవీ మండపం వద్ద శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. లలితా సహస్ర పారాయణం, హోమం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం చిన్నారులకు వివిధ రకాల ఆటలు పోటీలు ఏర్పాటు చేశారు. కారే శ్రీనివాసు, వి.అప్పారావు, మలసాల రమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

చింతపల్లి: చింతపల్లిలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సాయినగర్ వీధిలో భక్తులు దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అలంకరణలు చేశారు. అంతర్లలోని రాజరాజేశ్వరీ ఆలయంతోపాటు వంగసార ఆశ్రమంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం రాజరాజేశ్వరి ఆలయంలో విద్యార్థులు, భక్తులు సాముహిక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు చక్రవర్తి, వాడపల్లి శేషాచార్యులు, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: అమ్మాయిలు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు సూచించారు. మండలంలోని రేఖపల్లిలో శుక్రవారం ఏఎస్‌డీఎస్ కార్యాలయంలో నిర్వహించిన బాలికల దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికల కుటుంబ సభ్యులు విద్య, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో పురుషులతో దీటుగా ముందుకు సాగేలా ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల్లో పేద విద్యార్థులకు అవసరమైతే ఆర్థికసాయం అందిస్తానన్నారు. మహిళ, బాలల చట్టాలను వివరించారు.


సమావేశానికి హాజరైన బాలికలతో గాంధీబాబు

కొండగోకిరిలో నగర సంకీర్తన

కొయ్యూరు: కొండగోకిరిలో దానధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయాల అర్చకులకు దాతలు సమకూర్చిన పూజా సామగ్రిని డీవీడీ ప్రసాద్ పంపిణీ చేశారు. మంప పంచాయతీ బాలానగర్‌కు మైక్‌సెట్, రామన్నపాలెంకు భజన తాళాలు అందించారు. భాజపా అరకు పార్లమెంట్ కన్వీనర్ బీవీ భారతి, ధార్మిక విద్య సేవా కమిటీ అధ్యక్షులు కమలాంబిక, భాజపా మహిళా కన్వీనర్ మంగ, విశ్వహిందూ పరిషత్ నేతలు లోవరాజు, కృష్ణంరాజు, బొజ్జిబాబు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


నగర సంకీర్తనలో భక్తులు


చాపరాయి అందాలు అద్భుతం


చాపరాయిలో నిర్వాహకులతో జేసీ అభిషేక్ గౌడ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పర్యటక కేంద్రం చాపరాయి జలవిహారి అందాలు అద్భుతంగా ఉన్నాయని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ అన్నారు. శుక్రవారం కుటుంబసమేతంగా కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ సరదాగా గడిపారు. పర్యటకులతో మమేకమయ్యారు. గిరిజన మహిళల థింసా నృత్యాన్ని ఆస్వాదించారు. నిర్వాహకులతో ఫొటోలు తీసుకున్నారు.

కర్రలే కరెంట్ స్తంభాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే



నూరుపూడిలో చెట్ల ఆధారంగా లాగిన విద్యుత్తు తీగలు

సాధారణంగా గ్రామాలకు విద్యుత్తు సదుపాయం కల్పించాలంటే ముందుగా విద్యుత్తు స్తంభాలు వేసి, వాటిపై నుంచి తీగలు లాగుతారు. దీని ద్వారా ఆయా గ్రామాల్లో వెలుగులు నింపుతారు. అయితే మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ పరిధిలోని నూరుపూడిలో మాత్రం విద్యుత్తు స్తంభాలు కనిపించడం లేదు. వాటికి బదులుగా చెట్లు, కర్రలే విద్యుత్తు స్తంభాలుగా మారిపోయాయి. వాటి పైనుంచే విద్యుత్తు తీగలు లాగి సరఫరా చేస్తున్నారు. నూరుపూడి గ్రామానికి రంపచోడవరం మండలంలోని బూసిగూడెం నుంచి విద్యుత్తు లైను వేశారు. గతంలో సంభవించిన పెను తుపానుల తాకిడికి విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. గ్రామానికి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలనే సంకల్పంతో తీగలను ఈ మార్గంలో ఉన్న చెట్లుకు కట్టి సరఫరా చేస్తున్నారు. గ్రామంలో మాత్రం స్తంభాలకు బదులుగా కర్రలను ఏర్పాటుచేసి, వాటినే స్తంభాలుగా మార్చారు. ఇదే పరిస్థితి చాలాకాలంగా నడుస్తోందని గ్రామస్థులు తెలిపారు. చెట్లు, కర్రలపై నుంచి తీగలను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు, ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోననే ఆందోళన చెందుతున్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

పెదబయలు మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న దుకాణ సముదాయాల వద్ద విద్యుత్తు తీగలతో ప్రమాదం పొంచి ఉంది. దుకాణాల పైకప్పును తాకుతూ తీగలున్నాయి. దీనిపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని వారంతా కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు గ్రామీణం

అనుమతులు లేకుండానే టేకు చెట్ల నరికివేత

దేవీపట్నం, న్యూస్‌టుడే: చినరమణయ్యపేట- సీతారం గ్రామాల మధ్య పంట పొలంలో టేకు చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు ఆదేశాలతో శుక్రవారం దేవీపట్నం సెక్షన్ అధికారి బాపిరాజు టేకు చెట్లు నరికిన పొలం గట్టు పరిశీలించారు. రేంజ్ అధికారి మాట్లాడుతూ నరికివేతకు గురైన టేకు చెట్లు పంట భూముల్లో ఉన్నాయని, అటవీశాఖ అనుమతులు లేకుండానే నరికారని స్పష్టం చేశారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో పంట భూముల్లో ఉన్న చెట్లు ఎవరు నరికినా అటవీ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. నరికివేతకు గురైన చెట్లకు సంబంధించి రైతుల వివరాలు, వారు ఎవరికి అమ్మారు.. ఎక్కడకి తరలించారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. రెండు వారాల క్రితమే చెట్లను నరికి గోదావరి నదిలో పడవపై పరగసానిపాడు, పోశమ్మగండి పరిసర ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి రోడ్డు మార్గాన సీతానగరం తరలించినట్లు సమాచారం. నరికిన టేకు చెట్లు అటవీశాఖ అధికారులు 20 అని చెబుతుంటే వాటి సంఖ్య దాదాపు 50 వరకు ఉంటాయని తెలుస్తోంది. ఏళ్ల నాటి చెట్లు కావడంతో వాటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ముంపు గ్రామాల్లో విలువైన కలప అక్రమార్కులు తరలించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

మా దారి మాదే!

పెదబయలులో మూగజీవాలు రహదారికి అడ్డంగా ఉంటూ వాహనదారులను నానా అవస్థలకు గురిచేస్తున్నాయి. వాహనాలకు దారి ఇవ్వడం లేదు. రాత్రివేళల్లో వీటివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, పంచాయతీ ప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పెదబయలు


పెదబయలులో రహదారికి అడ్డంగా మూగజీవాలు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570,
అరకులోయ 63034 86346,
రంపచోడవరం 94908 77172

?: జలతరంగిణి జలపాతం వద్ద విరిగిపోయిన కర్రల వంతెనకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలి. పర్యటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.
– పల్లాల మంగిరెడ్డి, మారేడుమిల్లి

✓: పర్యటక ప్రదేశాల్లో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టే విధంగా తగిన కృషి చేస్తాం. పర్యటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం.
– వీరకిశోర్, ఎంపీడీవో, మారేడుమిల్లి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే



?: మారేడుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారి గోతులు, రాళ్లతో అధ్వానంగా ఉంది. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– భీశెట్టి సత్య, సోమిరెడ్డిపాలెం

✓: కళాశాలకు వెళ్లే దారిని సిమెంటు రోడ్డుగా నిర్మించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపిస్తాం. –వెంకట రమణ, మండల ఇంజినీరింగు అధికారి, మారేడుమిల్లి

కూనవరం, న్యూస్‌టుడే

?: రేగులపాడులో రెండు అంతర్గత దారులు గుంతలుగా మారి నడవడానికి ఇబ్బందిగా ఉంది. వీటిని సీసీ దారులుగా మార్చాలి. వ్యవసాయదారులు పొలాలకు వెళ్లడానికి సరైన దారి లేదు. – శ్రీరాములు, రేగులపాడు గ్రామస్థుడు

✓: పంచాయతీ పాలకవర్గంతో దీనిపై చర్చిస్తాం. నిధుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత త్వరగా ఈ రెండు దారుల సమస్యను పరిష్కరిస్తాం. ఉపాధిహామీ పథకంలో దారి వేయించడానికి తీర్మానం చేయిస్తాం.
– రామాంజనేయ ప్రసాదు, ఈవోఆర్డీ, కూనవరం

ప్రజల సహకారంతో పారిశుద్ధ్యం మెరుగు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ప్రజలు ముందుకు రావాలని అన్నవరం సీఆర్‌పీఎఫ్ ఈ 234 బెటాలియన్ కంపెనీ కమాండెంట్ ఇన్‌స్పెక్టర్ సేనాపతి అన్నారు. శుక్రవారం అన్నవరం సంతమార్కెట్ వద్ద స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మార్కెట్ పరిసరాల్లో మొక్కలు నాటారు. వీధుల్లో చెత్త తొలగించారు. సీఆర్‌పీఎఫ్ ఎస్సై సైమన్, ఏఎస్ఐ రమణ తదితరులు పాల్గొన్నారు.


అన్నవరం సంతమార్కెట్ వద్ద పరిసరాలు శుభ్రం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని అరుకు పంచాయతీ సర్పంచి శారద అన్నారు. అరుకు పంచాయతీ కేంద్రంలో కార్యదర్శి వల్లిబాయ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంత పరివాహక ప్రాంతంతోపాటు, కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు.